ఆకాశవాణి హైదరాబాద్ కేంద్ర

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ. 21.01.2026 సమయం. 1310 గంటలు

ముఖ్యాంశాలు

1. స్విట్జర్లాండ్ లోని దావోస్ లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో తెలంగాణ లైఫ్ సైన్సెస్ పాలసీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈరోజు ఆవిష్కరించారు.
2. తెలంగాణాలో పెట్టుబడులు పెట్టేందుకు గూగుల్, ఫిలిప్స్, యునిలీవర్, ఎక్స్ పర్టైజ్, లోరియల్ తదితర సంస్థలు ముందుకు వచ్చాయి. పలు సంస్థలు ఈ మేరకు ప్రభుత్వంతో ఎమ్.ఓ.యు కుదుర్చుకున్నాయి.
3. ప్రతి ఏడాది జులైలో హైదరాబాద్ లో ప్రపంచ ఆర్థిక వేదికకు కొనసాగింపుగా సదస్సును నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దావోస్ సదస్సులో ప్రతిపాదించారు.
4. కాంగ్రెస్ ప్రభుత్వం సమస్యల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు ఫోన్ ట్యాపింగ్ కేసును సాగదీస్తోందని కేంద్ర హోం శాఖ సహాయమంత్రి బండి సంజయ్ విమర్శించారు.

Early-లైఫ్ సైన్సెస్ పాలసీ:

తెలంగాణ రాష్ట్ర లైఫ్ సైన్సెస్ తర్వాతి తరం విధానాన్ని దావోస్ లో జరుగుతున్న వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ లో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి కూడా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ విధానం ప్రకారం, 2030 నాటికి రాష్ట్రాన్ని 5 అగ్ర శ్రేణి గ్లోబల్ లైఫ్ సైన్సెస్ క్లస్టర్‌లలో ఒకటిగా అభివృద్ధి చేసే లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించుకుంది. 25 బిలియన్ డాలర్ల పెట్టుబడులతో 5 లక్షల ఉద్యోగాలను కల్పించాలని లక్ష్యంగా పెట్టుకుంది. గ్లోబల్ లైఫ్ సైన్సెస్ హబ్‌గా రాష్ట్ర స్థానాన్ని బలోపేతం చేయడానికి గ్రీన్ ఫార్మా సిటీ, ఫ్లాగ్‌షిప్ ఫార్మా విలేజెస్ లాంటి చొరవ్ తీసుకుంటుంది. అలాగే రానున్న రోజుల్లో వెయ్యి కోట్ల రూపాయిలవరకు పెంచే అవకాశం ఉన్న లైఫ్ సైన్సెస్ ఇన్నోవేషన్ ఫండ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.

MSL

ఫస్ట్ డే

తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో పలు అంతర్జాతీయ సంస్థలు ముందుకు వచ్చాయి. నిన్న తొలిరోజు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బృందంతో గూగుల్, ఫిలిప్స్, యునిలీవర్, ఎక్స్ పర్టైజ్ తదితర సంస్థలతో పాటు.. యూఏఈ ప్రభుత్వ ప్రతినిధులు సమావేశం అయ్యారు. సైబర్ సెక్యూరిటీ, స్టార్టప్‌లు, ట్రాఫిక్, వ్యవసాయం, వాతావరణ మార్పుల్లో సహకారం అందించేందుకు గూగుల్ సుముఖత వ్యక్తం చేయగా.. ఫ్యూచర్ సిటీలో మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల ఏర్పాటుకు యూఏఈ ప్రభుత్వం ఆసక్తి చూపించింది. స్కిల్ యూనివర్సిటీలో భాగస్వామ్యం అయ్యేందుకు ఎక్స్ పర్టైజ్, ఏఐసిటీలో నాలెడ్జ్ హబ్‌కు ఫిలిప్స్, జీసీసీ ఏర్పాటుకు యునిలీవర్ సంస్థలు సంసిద్ధత వ్యక్తంచేశాయి.

జీఎస్

లోరియల్

అంతర్జాతీయ సౌందర్య ఉత్పత్తుల ప్రముఖ లోరియల్ సంస్థ తన గ్లోబల్ టెక్నాలజీ హబ్‌గా హైదరాబాద్‌ను ఎంచుకుంది. ప్రపంచంలోనే మొట్టమొదటి బ్యూటీ–టెక్ గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్ ను హైదరాబాద్లో ఏర్పాటు చేస్తున్నట్లు ఆ సంస్థ ప్రకటించింది. దావోస్‌లో జరుగుతున్న వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ సదస్సులో భాగంగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో లోరియల్ సీఈఓ నికోలస్ హియోరోనిమస్ భేటీ అయ్యారు. ఈ కేంద్రాన్ని ఈ ఏడాది నవంబర్‌లోనే ప్రారంభించనున్నట్లు ప్రకటించారు.

పిటిసి హైదరాబాద్

ఎంఓయూ

దావోస్ వేదికగా కాలిఫోర్నియాకు చెందిన ప్రముఖ సెమీకండక్టర్ సంస్థ 'బ్లైజ్' తో తెలంగాణ ప్రభుత్వం కీలక ఎంవోయూ కుదుర్చుకుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బ్లైజ్ సీఈఓ దినాకర్ మునగాల మధ్య జరిగిన ఈ చర్చలతో హైదరాబాద్‌లోని రీసెర్చ్, డెవలప్‌మెంట్ సెంటర్ భారీగా విస్తరిస్తుందని భావిస్తున్నారు. రాష్ట్రాన్ని గ్లోబల్ ఏఐ హబ్‌గా మార్చడమే లక్ష్యంగా, హెల్త్‌కేర్, మాన్యుఫ్యాక్చరింగ్ రంగాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పైలట్ ప్రాజెక్టులను చేపట్టనున్నారు.

పిటిసి హైదరాబాద్

రేవంత్ ప్రతిపాదన

ప్రతి ఏడాది జులైలో హైదరాబాద్‌లో ప్రపంచ ఆర్థిక వేదిక కొనసాగింపు సదస్సు నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపాదించారు. దావోస్‌లో జరిగిన ‘జాయిన్ ది రైజ్’ కార్యక్రమంలో ఈ ప్రతిపాదనకు గ్లోబల్ బిజినెస్ లీడర్లు, పాలసీ నిర్ణేతలు ఏకగ్రీవంగా మద్దతు తెలిపారు. ఈ రోజుల్లో పెట్టుబడుల ఒప్పందాలు, వ్యాపార వాణిజ్య నిర్ణయాలకు ఒక సంవత్సరం చాలా ఎక్కువ సమయమని ముఖ్యమంత్రి అన్నారు. అందుకే ప్రతి ఏడాది జులై లేదా ఆగస్టులో

హైదరాబాద్‌లో ఫాలో-అప్ ఫోరం నిర్వహించాలని వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ ప్రతినిధులకు సూచించారు.

జీఎస్

రేవంత్

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ను వినియోగించి తెలంగాణలో పౌర సేవలను మరింత సమర్థవంతంగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. దావోస్ లో ప్రపంచ ఆర్థిక వేదికసదస్సులో 'ఇంటెలిజెంట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫర్ బిల్డింగ్ కంపెటిటివ్ నెస్' అంశంపై జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. రైతు భరోసా వంటి సబ్సిడీల ట్రాకింగ్ నుంచి మొదలుకుని ఆస్తి పన్ను వసూళ్లు, మహిళలకు అందించే సంక్షేమ పథకాల అమలు, పట్టణ మున్సిపల్ సమస్యల పరిష్కారం వరకు అనేక రంగాల్లో ఏఐ ఆధారిత పరిష్కారాలను తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. ఏఐని సరైన దిశలో వినియోగిస్తే పాలన మరింత సమర్థవంతంగా మారుతుందని అన్నారు.

జీఎస్

పొన్నం ప్రారంభాలు

హైదరాబాద్ నగరంలో కాలుష్య పరిస్థితులు ఢిల్లీ మాదిరిగా తయారు కాకుండా ఉండాలన్న కార్యాచరణతో ముందుకు వెళ్తున్నట్లు రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. సికింద్రాబాద్ జోన్ పరిధిలో సుమారు 11 కోట్ల రూపాయలతో కొత్తగా నిర్మించిన కవాడిగూడ, ముషీరాబాద్ సర్కిల్ కార్యాలయాలను ఈరోజు ప్రారంభించిన అనంతరం మంత్రి మాట్లాడుతూ....

(బైట్ - పొన్నం ప్రభాకర్)

ఈ కార్యక్రమంలో మేయర్ గద్వాల విజయ లక్ష్మి, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత, ఎమ్మెల్యే ముఠా గోపాల్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ తదితరులు పాల్గొన్నారు.

జీఎస్

బండి సంజయ్

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యల నుండి దృష్టి మళ్లించేందుకు ఫోన్ ట్యాపింగ్ కేసును వాడుకుంటోందని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ విమర్శించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల దాకా ఫోన్ ట్యాపింగ్ కేసును సాగదీసేలా కనిపిస్తోందని ఎద్దేవా చేశారు. విచారణ పేరుతో ఇంకెన్నాళ్లీ డ్రామాలు? 'ఢిల్లీకి, ఫాంహౌస్‌కు మధ్య ఇంకా డీల్ కుదరలేదా? సూత్రధారులైన తండ్రీ కొడుకులను ఎందుకు విచారించడం లేదు? ఒక్క నాయకుడినైనా అరెస్ట్ చేశారా? తన ఫోన్ కూడా ట్యాప్ చేశారంటూ హరీష్ రావు గతంలో చెప్పారు కదా? అంటూ బండి సంజయ్ ప్రశ్నల వర్షం కురిపించారు. రెండేళ్లుగా సాగుతున్న విచారణలో కొండను తవ్వి కనీసం ఎలుకను కూడా పట్టలేకపోయారని ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో సూత్రధారులను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అరెస్ట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

డెస్క్

అడ్లూరి

హరీష్ రావుకు సిట్ అధికారులు నోటీసులు ఇస్తే దానిని కాంగ్రెస్ పార్టీకి ఆపాదించడం సరికాదని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. జగిత్యాలలో 235 కోట్ల రూపాయలతో నిర్మించనున్న 450 పడకల ఆసుపత్రి భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన అనంతరం మంత్రి మాట్లాడుతూ...

(బైట్ - అడ్లూరి లక్ష్మణ్ కుమార్)

పిటిసి జగిత్యాల

నాగోబా

ఆదివాసీల ఆరాధ్య దైవమైన కేస్లాపూర్ నాగోబా జాతరలో కులమతాలకు అతీతంగా భక్తులు పాల్గొనడం దేశ సమైక్యతకు, గొప్ప సంస్కృతికి నిదర్శనమని గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. నిన్న రాత్రి ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్ లో నాగోబాను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసిన అనంతరం మంత్రి మాట్లాడుతూ, నాగోబా ఆలయంతో పాటు ఈ ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. ఆదివాసీలు చెట్లను, పుట్టలను, నీటిని, జంతువులను పూజించడం ద్వారా ప్రకృతిని కాపాడుకుంటున్నారనీ, మెస్రం వంశస్తులు గంగాజలం తెచ్చి, ఎంతో నిష్ఠతో సంప్రదాయాలను పాటిస్తూ ఈ జాతరను నిర్వహించడం అభినందనీయమన్నారు.

పిటిసి నిర్మల్

పొన్నం

మేడారం జాతరకి వచ్చే భక్తులకు బస్సులు అందుబాటులో ఉండేలా ఆర్టీసీ అధికారులు సమర్థవంతంగా వ్యవహరించాలని రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. సచివాలయంలో మంత్రి నిన్న సమీక్షా సమావేశం నిర్వహించారు. గత మేడారం జాతరలో 3వేల 491 ఆర్టీసీ బస్సులు నడిపించగా.. సుమారు 17 లక్షల మంది ప్రయాణికులు ప్రయాణించారని, ఈసారి 20 లక్షల మంది ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేస్తారనే అంచనాతో 4వేల బస్సులను నడిపిస్తున్నట్లు పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

జీఎస్

మండమెలిగే పండుగ

ములుగు జిల్లా మేడారంలోని సమ్మక్క, సారలమ్మలకు తొలి పూజలు ఈరోజు నుంచి ప్రారంభం అయ్యాయి. వారం రోజుల ముందుగా మండమెలిగే పండగతో మహాజాతర ప్రారంభం అయినట్లు పూజారులు భావిస్తారు. దీనికి ఎంతో విశిష్టత ఉంది. ఈ పండగ విజయవంతమైతే జాతర గొప్పగా జరుగుతుందని పూజారులు, భక్తుల నమ్మకం.

డెస్క్

ఆది

అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ప్రభుత్వం లక్ష్యమని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఇస్లాంనగర్ లో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ...

(బైట్ - ఆది శ్రీనివాస్)

పిటిసి సిరిసిల్ల

ఇండ్ల నిధులు

రాష్ట్ర వ్యాప్తంగా ఇందిరమ్మ ఇండ్ల పథకంలో సొంత ఇంటిని నిర్మించుకుంటున్న సుమారు 23 వేల మంది లబ్ధిదారులకు గడిచిన వారం రోజులకు సంబంధించి 262 కోట్ల రూపాయలకు పైగా విడుదల చేశారు. ఈ వారం చేసిన చెల్లింపుల్లో, బేస్ మెంట్ స్థాయి నిర్మాణపు పనులను పూర్తి చేసిన లబ్ధిదారులు 2వేల 763 మంది ఉండగా, గోడలు - శ్లాబ్ కట్టడాల స్థాయి దాటిన వారు 20వేల 186 ఉన్నారని హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరక్టర్ వి.పి.గౌతం వివరించారు.

డెస్క్

పోలీస్

కొన్ని ప్రత్యేక నేరాల్లో బాధితులు పోలీస్ స్టేషన్ కు వెళ్లి ఫిర్యాదు చేయాల్సిన అవసరం లేకుండానే.. వారి ఇంటికే వెళ్లి కేసు నమోదు చేయాలని రాష్ట్ర పోలీసు శాఖ నిర్ణయించింది. ఈ విధానం అమలుకు సీఐడీ.. ప్రామాణిక కార్యాచరణ విధానం (SOP)ని రూపొందించింది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని పోలీస్‌స్టేషన్లు, స్టేషన్ హౌస్ ఆఫీసర్ లు ఈ ఎస్‌వోపీని అనుసరించాలని సీఐడీ చీఫ్ చారుసిన్హా స్పష్టం చేశారు.

డెస్క్